

త్రిపుర గవర్నర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన నల్లు ఇంద్రసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు పి.కృష్ణాదిశేషు - వనస్థలిపురం,ఆంధ్రజ్యోతి

హిందూ ధర్మపరిరక్షణ కోసం కఠిన చట్టాలు చేయాలి

- భారత్ నేషనలిస్ట్ ఫోరం

చంపాపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హిందువులు, హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రభుత్వం కఠినమైన ప్రత్యేక చట్టాలు రూపొందించాలని భారత్ నేషనలిస్ట్ ఫోరం డిమాండ్ చేశారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో సోమవారం ఫోరం సభ్యులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫోరం ముఖ్య సలహాదారు బొడ్డ మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రతి హిందువు తమ ప్రాంతంలో హిందువుల క్షేమం కోసం గుడి లేదా కూడళ్లలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. అధిక సంఖ్యలో సంతకాల సేకరణ చేపట్టి ఫోరంకు అందజేయాలని కోరారు.

గత ప్రభుత్వ అక్రమాలను వెలికితీయడమే లక్ష్యం

- పీసీసీ అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి



కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అక్రమాలను వెలికితీయడమే ప్రధాన లక్ష్యమని పీసీసీ అధికార ప్రతినిధి, జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అయిన మిమ్మల్ని ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే అధికార బీఆర్ఎస్‌కు భయపడి ఆ పార్టీలో చేరిన మీరా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడేది అని దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఎల్బీనగర్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి చేసిన వ్యాఖ్యలను రాజశేఖర్‌రెడ్డి ఖండించారు. 88మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి భయపడలేదని, ఇప్పుడు మీరు కేవలం 39మంది మాత్రమే ఉన్నారని ఇప్పుడెలా భయపడతారని ఆయన ప్రశ్నించారు. సుధీర్‌రెడ్డి ఏమి చేసినా కాంగ్రెస్ పార్టీలోకి ఆయనను తీసుకునేది లేదని స్పష్టం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- ఇద్దరి అరెస్టు, పరారీలో మరొకరు
- 32క్వింటాళ్ల బియ్యం, లారీ స్వాధీనం



లారీ డ్రైవర్, క్లీనర్‌ను అరెస్టు చేసి లారీని, రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్న పోలీసులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని మలక్‌పేట పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు కారకులైన లారీ డ్రైవర్, క్లీనర్‌లను అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నాడు. 32క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన మహ్మద్ రిజ్వాన్ హైదరాబాద్ నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఛత్తీస్‌ఘడ్‌కు తరలిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు మలక్‌పేట పోలీసులు మూసారాంబాగ్ చౌరస్తాలో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లోడ్‌తో ఉన్న లారీపై అనుమానం వచ్చి తనిఖీలు చేయగా, రేషన్ బియ్యం బయటపడ్డాయి. 32క్వింటాళ్ల రేషన్ బియ్యం ఛత్తీస్‌ఘడ్‌కు తరలిస్తున్నట్లుగా ఛత్తీస్‌ఘడ్ బల్దేవ్‌పూర్‌కు చెందిన లారీ డ్రైవర్ భీరేంద్రకుమార్ (28) పోలీసులకు వివరించాడు. ఈమేరకు పోలీసులు లారీలో ఉన్న 32క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రేషనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ భీరేంద్ర కుమార్‌తోపాటు క్లీనర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రేషన్ బియ్యం తరలింపునకు అసలు సూత్రధారుడైన మహ్మద్ రిజ్వాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతనిని పట్టుకోడానికి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కేసును మలక్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి

బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ మందిర్ బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి సిబ్బంది పటిష్ఠ చర్యలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సాహెబ్‌నగర్‌లోని ఆయుష్మాన్ మందిర్ బస్తీ దవాఖానాలో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దవాఖానాకు ఎంతమంది రోగులు వస్తున్నారు, వారికి సరిపడ వైద్యసేవలు, మందులు పంపిణీ తదితర సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ మందిర్ బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజ్యలక్ష్మి, శ్వేత, అనిత, వినోద్, ధరణికుమార్, సత్యప్రకాశ్, మనీషా పాల్గొన్నారు.

మిథిలానగర్‌లో యూజీడీ పనులు ప్రారంభం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లోని మిథిలానగర్ కాలనీలో రూ.10లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులను సోమవారం మేయర్ దుర్గాదీప్‌లాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో పూర్తి నాణ్యత పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో ట్రంకు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ట్రంకు లైను పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధివినాయక నగర్ కాలనీలో జరుగుతున్న ట్రంకు లైను పనులను సోమవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లైనును కుంట్లూర్ ప్రధాన ట్రంకు లైనుకు కలపడం జరుగుతుందన్నారు. మదర్ డెయిరీ యాజమాన్యం ట్రంకు లైను పనులకు అడ్డుతగులుతున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

అనుమతులు రెండతస్తులు .. నిర్మాణాలు మూడు అంతస్తులు

- ఓపెన్ స్థలాలలో క్రయవిక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణం

హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో అనుమతి లేని నిర్మాణాలు అడ్డగోలుగా జరుగుతున్నా పట్టించుకోవడంలేదు. ఎక్కడ చూసినా రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని, మూడు అంతస్తులు నిర్మిస్తున్నారని పలు కాలనీల ప్రజలు తెలిపారు. అంతటితో ఆగకుండా ఆపైన పెంట్ హౌస్‌లు నిర్మిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు మాత్రం స్పందించడంలేదు. పలు కాలనీలలో ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు తెలిపారు. పైగా అధికారులు ఫిర్యాదుదారులనే బెదిరిస్తున్నారని పలువురు తెలిపారు.

హయత్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ వ్యక్తి బాతుల చెరువుకట్ట కింద ఉన్న షిర్డీ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ముఖ్యమంత్రికి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా సంబంధిత ఓ అధికారి ఫిర్యాదు దారునికి ఫోన్ చేసి మీరు కూడా పెంట్‌హౌస్ నిర్మించారు కదా మీపైన చర్యలు తీసుకుంటామని బెదిరించారని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రజా అవసరాలకు వదిలిన స్థలాలను కూడా అధికారులు కాపాడలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. అధికారుల ఉదాసీనత వల్ల అడ్డగోలుగా అనుమతి లేని భవనాలు వెలుస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం వల్ల జీహెచ్ఎంసీ పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోవాల్సి వస్తుంది. ఇదే అదనుగా భావిస్తున్న అక్రమార్కులు లేవుట్‌లనే మార్చి పార్కు స్థలాలను, వివిధ అవసరాల కోసం వదిలిన ఓపెన్ స్థలాలను ఆక్రమిస్తు బిల్డర్‌లచేత వేగంగా అక్రమ నిర్మాణాలు చేయిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఇంటి నిర్మాణం జరిగిపోయిందని, ఇప్పుడు ఏమిచేస్తామని దాటవేస్తున్నారు. పలు కాలనీలలో కొందరు కోర్టుకు వెళ్లినా ఫలితం లేకుండా పోతుంది. అయినా అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలను ఆపడంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హయత్‌నగర్ జీ స్కూల్ నుంచి మునగనూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న షిర్డీ కాలనీ, తిరుమల కాలనీ, పర్వతనగర్ కాలనీలలో పదుల సంఖ్యలో అనుమతి లేని భవనాల నిర్మాణం నేటికీ జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. శివారులోని హయత్‌నగర్ డివిజన్‌లలోని లేఅవుట్‌లలో వదిలిన స్థలాలు, పార్కులపైన దృష్టిసారిస్తే విలువైన పార్కు స్థలాలు, ఓపెన్ స్థలాలు రక్షించవచ్చునని పలువురు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణదారులపైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా అక్రమాలకు సహకరిస్తున్న అధికారులపైన, కబ్జాదారులపైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాత నిర్మాణాలతో మాకు సంబంధం లేదు?

పాత నిర్మాణాలతో మాకు సంబంధం లేదు. మేము బాధ్యతలు తీసుకున్న తరువాత జరిగే వాటితోనే మాకు సంబంధం. కొన్ని హెడ్ ఆఫీసు పర్మిషన్లు, కొన్ని జోనల్ ఆఫీసు పర్మిషన్లు ఉంటాయి. ఎక్కడని పరిశీలించమంటారు. అక్రమ నిర్మాణాలు ఉంటే మాకు చూపించండి. ఇప్పటికే కొన్నింటికి షోకాజ్ నోటీసులు ఇచ్చాం. నేను వచ్చాక ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. షిర్డీనగర్‌లో రెండు లేవుట్‌లు ఉన్నాయి. రోడ్డుపైన ఇళ్లు నిర్మిస్తున్నవారు పేదవారు. వారికి డాక్యుమెంట్లు ఉన్నాయి. అయినా ఇంటి నిర్మాణం చేస్తే తీసివేస్తామని చెప్పాం. కొన్ని పార్కులలో నిర్మాణాలు జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. చర్యలు తీసుకుంటాం.

- పావని, ఏసీపీ, హయత్‌నగర్ సర్కిల్, జీహెచ్ఎంసీ.

దర్జాగా రోడ్డును ఆక్రమించి భవనం నిర్మాణం



ప్రమాదభరితంగా రోడ్డు మీద నాటిన ఇనుప రాడ్లను చూపిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని లెక్చరర్స్‌కాలనీ కమాన్ రోడ్డు నంబర్ 5లో నార్త్ ఈస్ట్ వైపు రోడ్డును ఆక్రమిస్తు నిర్మిస్తున్న భవనంను సోమవారం కాలనీ ప్రజలతో కలిసి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి సందర్శించారు. లెక్చరర్స్ కాలనీ సంక్షేమ సంఘం వారించినా వినకుండా భవన యజమాని ఇంటి ముందున్న 25 ఫీట్ల రోడ్డును ఆక్రమిస్తు నిర్మాణం చేశాడని ఫిర్యాదు అందుకున్న కార్పొరేటర్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం యజమాని అనుమతులకు మించి అంతస్తులు నిర్మించడమే కాకుండా రోడ్డుపైన ఉన్న జీహెచ్ఎంసీ మ్యాన్‌హోల్స్‌పైన కూడా నిర్మాణం చేశాడని తెలిపారు.

పైగా భవనం మూలమలుపునకు రోడ్డు మీద ప్రమాదభరితంగా ఇనుపరాడ్లు నాటారని అన్నారు. తెలియక కారు, లేదా బైకు దానికి తగిలినా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఐదు ఫీట్ల వరకు ఇరువైపుల రోడ్డు ఆక్రమణకు గురి అయిందన్నారు. అంతటితో ఆగకుండా పక్క ఇంటి ప్రహరీని కూడా ఆక్రమించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని తెలిపారు. కాలనీ ప్రజలు ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడని కార్పొరేటర్ తెలిపారు. అసలే అక్రమ నిర్మాణం, ఆపైన రోడ్లు కబ్జా చేసి భవనం నిర్మిస్తుంటే జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణానికి ఓసీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలోని కొంత మంది పెద్దల అండదండలతో భవన యజమాని జీహెచ్ఎంసీ నిబంధనలను కాలరాసి ప్రజలకు ఇబ్బంది కలిగేలా భవనం నిర్మిస్తున్నారని కార్పొరేటర్ తెలిపారు. అక్రమ అంతస్తులపైన, రోడ్డు ఆక్రమణలపైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాలనీల ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో 32 సీసీ కెమెరాలు ప్రారంభం



చాదర్‌ఘాట్ పీఎస్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ శ్యాంసుందర్, పక్కన ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత, చట్టం అమలు మెరుగుపరిచేందుకు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యాధునిక సీసీ టీవీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ అన్నారు. సోమవారం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు రూ.7లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 32 సీసీటీవీ కెమెరాలను చాదర్‌ఘాట్ సీఐ ప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ముత్తూట్ ఫైనాన్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముత్తూట్ గ్రూప్ చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులను, పలు ప్రాంతాల్లో 32 సీసీ కెమెరాల ఏర్పాటుకు అందించిన సహకారం అభినందనీయమన్నారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏమూలన ఏం జరిగినా గుర్తించేందుకు వీలుగా అత్యాధునిక సీసీటీవీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ జానకీ దరావత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ స్టేట్ హెడ్ కందుకూరి శ్రీనివాస్, టెరిటరీ మేనేజర్ అబ్రహం జాన్, మేనేజర్ లక్ష్మీనారాయణ, రీజినల్ మార్కెటింగ్ మేనేజర్ లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు శ్రీ వైష్ణవి ట్రస్ట్ చెక్కులు అందజేత



పేద విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు

చంపాపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండలం కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న పేద బ్రాహ్మణ విద్యార్థులు గురురాజా, శైలజలకు సోమవారం వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పోచంపల్లి రమణారావు ఒకొక్కరికి ఫీజు డబ్బులు రూ.37,500ల చొప్పున చెక్కులను అందజేశారు. విద్యార్థుల చదువులు మధ్యలో నిలిచిపోకుండా వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సహాయం చేసినట్లు తెలిపారు. ట్రస్ట్ వారు అందించిన సాయం మరువలేనిదని, విద్యార్థులు గురురాజా శైలజ అన్నారు. సభ్యులు దేవులపల్లి రంగారావు, మంత్రి సునిల్‌కుమార్, దేశ్‌ముఖ్ రమాకుమార్, దేవులపల్లి అశోక్‌కుమార్, కళాశాల అకౌంటెంట్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన అంతంత మాత్రమే

- ప్రజావాణిలోను కార్పొరేటర్ల ఫిర్యాదులే



ప్రజావాణిలో గౌతమ్‌నగర్ సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆశించినంతగా స్పందన కానరావడంలేదు. నేరుగా ప్రజలు వచ్చి ఇచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం వ్యక్తిగతమైనవి (అక్రమ నిర్మాణాలు, ఇంటి పరిసరాలలో ఇబ్బందులు) కావడం గమనార్హం.. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో కార్పొరేటర్లు ప్రజాసమస్యలపై ప్రజావాణిలోనే ప్రస్తావిస్తున్నారు. సోమవారం నాటి ప్రజావాణిలో గడ్డిఅన్నారం డివిజన్ గౌతమ్‌నగర్‌కు చెందిన రోడ్ల సమస్యపై కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి వచ్చి జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేశారు. ఇక సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, విజయపురికాలనీ, లక్ష్మీనగర్, ఎస్‌బీఐ కాలనీలలో పెండింగ్ పనులు, పోచమ్మబాగ్, వెంకటేశ్వరకాలనీ, కృష్ణానగర్, క్రాంతినగర్, శంకర్‌నగర్‌లలో రోడ్లకు నిధుల మంజూరు, శంకర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, లక్ష్మీనగర్‌లలో కమ్యూనిటీ హాళ్ల పెండింగ్, విజయపురి కాలనీ, జేబీ కాలనీలో నాలా పనులు, అక్రమ పార్కింగ్, శానిటైజేషన్ పనులపై, జలమండలి భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ సమస్యలపై కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేశారు.

మెరుగైన కంటి చూపుతోనే ప్రమాదాల నివారణ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అన్నిరకాల మోటారు వాహనాలను నడిపే వాహనాదారులు, డ్రైవర్లు ప్రమాదాల బారిన పడకుండా నివారించుకోడానికి మెరుగైన కంటి చూపు అవశ్యమని మలక్‌పేట ఆర్టీఏ ఈస్ట్‌జోన్ కార్యదర్శి వి.సుభాష్‌చందర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మలక్‌పేట ఆర్టీఏ కార్యాలయంలో గ్లోబల్ కంటి ఆస్పత్రి వైద్య బృందంతో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, వాహనదారులు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకుని కంటి చూపులో ఉన్న లోపాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే కంటి అద్దాలను ధరించడం, కంటి చూపులో చాలా లోపాలున్నవారు కంటి ఆపరేషన్లు చేయించుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమేష్‌బాబు, అరుణ, ఉమ, నరేంద్రపాల్ సింగ్, ఏఎంవీఐలు రజిని, సైద, ఏవోలు విజయ్, ప్రవీణ్, మధుకర్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో అనిల్ కుమార్ యాదవ్

ముగిసిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

తిరుమలగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి విలేజ్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ గ్లోబ్ వర్సెస్ హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్‌లు పోటీ పడ్డాయి. ఫైనల్లో హైదరాబాద్ గ్లోబ్ టీం విజయం సాధించింది. విజేతకు 50వేల ప్రైజ్ మనీ, రన్నర్ అప్‌కు 25వేల ప్రైజ్ మనీని సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కన్వీనర్ రేమండ్ హార్వర్డ్, ప్యారసాని రామ్‌కుమార్ అందజేశారు. యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మైఖేల్ అబ్రహం పాల్గొన్నారు.



వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్‌కె.రియాజ్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ జావేద్, జాఫర్ - వనస్థలిపురం,ఆంధ్రజ్యోతి


బైక్‌ను ఢీకొన్న టిప్పర్ - మహిళ దుర్మరణం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి వేగంగా దూసుకు వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ టిప్పర్ కింద పడి దుర్మరణంపాలైన సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ మండలం మద్దిగట్లకు చెందిన దూపల్లి లక్ష్మి(52) చంపాపేట్‌లోని సిద్ధార్థ స్కూల్ సమీపంలో నివసిస్తూ కూలీగా పనిచేస్తోంది. సోమవారం సాయంత్రం కొడుకుతో కలిసి ద్విచక్ర వాహనంపై హస్తినాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి చంపాపేట్‌కు వెళ్తుండగా జడ్పీ రోడ్‌లో వేగంగా దూసుకువచ్చిన టిప్పర్ వారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దాంతో బైక్‌పై కూర్చున్న లక్ష్మి కిందపడిపోగా టిప్పర్ టైరు ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయింది. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.300 జరిమానా విధిస్తు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పట్టాభిరామారావు తీర్పు చెప్పారు. పీపీ రాజిరెడ్డి కథనం ప్రకారం.. ఎల్బీనగర్‌కు చెందిన ఓ యువకుడు అదే ప్రాంతానికి చెందిన బాలికతో పరిచయం పెంచుకున్నాడు. బాలిక కొత్తపేటలో ఇంటర్ చదువుతున్న సమయంలో మాయమాటలు చెప్పి నల్గొండ తీసుకెళ్లాడు. అక్కడే ఆ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. అక్కడి నుంచి బాలిక తప్పించుకుని ఎల్బీనగర్‌లోని తల్లిదండ్రుల వద్దకు చేరుకుని జరిగిన విషయాన్ని వివరించింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన ఎల్బీనగర్ పోలీసులు సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాలను పరిశీలించిన మొదటి అదనపు జిల్లా, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పట్టాభిరామారావు నిందితునికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.300 జరిమానా విధిస్తు తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగోల్ పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్ చౌరస్తాలో గుర్తు తెలియని వ్యక్తి (60) శనివారం రాత్రి స్పృహతప్పి పడిపోగా, స్థానికుల సమాచారంతో నాగోల్ పోలీసులు అతన్ని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను ఆదివారం చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతనికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

ఎంవీ యాక్ట్-2019కు వ్యతిరేకంగా ఆటోనగర్‌లో నేడు సదస్సు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంవీ యాక్ట్-2019ను రద్దు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆటోనగర్ లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం, ఆటోనగర్ మెకానిక్స్, టెక్నికల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ఈనెల 6న (మంగళవారం) ఆటోనగర్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆటోనగర్‌లో ఆవిష్కరించారు. డ్రైవర్లు, ఓనర్ కం డ్రైవర్లను జైలుపాలు చేసేందుకే నూతన మోటర్ వెహికిల్ చట్టాన్ని తీసుకువచ్చారని నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఆటోనగర్ లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ సలావుద్దీన్, ఆటోనగర్ మెకానిక్స్, టెక్నికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అంజనేయులు కరపత్రం విడుదల చేసినవారిలో ఉన్నారు.